క్లుప్తంగా

జాతీయ అథ్లెటిక్స్ పోటీలకు నాగబాబు ఎంపిక



బంగారు పతకాలు సాధించిన నాగబాబు

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ): రాజస్థాన్‌లోని ఆళ్వార్‌లో జరిగే 44వ జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలకు జిల్లాలోని సామర్లకోట సమీపంలోని జల్లూరుకు చెందిన మాస్టర్స్ అథ్లెటిక్స్ క్రీడాకారుడు యాతం నాగబాబు ఎంపికయ్యారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి ఆరు నుంచి మూడు రోజుల పాటు ఈ పోటీలు జరగనున్నాయి. ఈ నెల 14, 15 తేదీలలో కృష్ణా జిల్లా ఎన్టీఆర్ స్పోర్ట్స్ స్టేడియంలో జరిగిన 44వ రాష్ట్ర స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలలో నాగబాబు ప్రతిభను కనబర్చారు. 200, 400, 800 మీటర్ల పరుగులో మూడు బంగారు పతకాలు సాధించారు. జిల్లా వైద్యారోగ్య శాఖలోని మలేరియా విభాగంలో యూనిట్ ఆఫీసర్‌గా నాగబాబు విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు ఆయన 15 బంగారు, 19 వెండి, 26 కాంస్య పతకాలు సాధించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు శేషసాత్విక్ ఎంపిక



సాత్విక్‌కు ప్రశంసాపత్రం ఇస్తున్న నిర్వాహక బృందం

కాకినాడ క్రైం: భగవద్గీత శ్లోక రాష్ట్ర స్థాయి పోటీలకు కాకినాడకు చెందిన విద్యార్థి శేషసాత్విక్ ఎంపికయ్యాడు. ఆదివారం స్థానిక కోకిల సెంటర్‌లోని రామకృష్ణ స్కూల్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన సాత్విక్ రాష్ట్ర పోటీలకు అర్హత సాధించాడు. వీహెచ్‌పీ అనుబంధ భారత సంస్కృత పరిషత్ ఆధ్వర్యంలో ఈ పోటీలు జరుగుతున్నాయి. కాకినాడ అక్షర స్కూల్‌లో నాలుగో తరగతి చదువుతున్న సాత్విక్ గురువు ప్రముఖ భగవద్గీత శిక్షకురాలు డాక్టర్ గీతామణి అని విద్యార్థి తండ్రి కేవీఎస్‌వీ ప్రసాద్ తెలిపారు. ఈ నెల 25న విజయవాడలోని సత్యనారాయణపురంలోని వీహెచ్‌పీ అనుబంధ విద్యాలయంలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో సాత్విక్ జిల్లాకు ప్రాతినిధ్యం వహించనున్నాడు. పోటీల నిర్వహణను వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు రవిశంకర్ పట్నాయక్, రామకృష్ణ మిషన్ ప్రెసిడెంట్ గాంధీ, సాహితీవేత్త గొట్టిముక్కల నరసింహశాస్త్రి, గ్రంధి నాగమణి, సత్యవాణి తదితరులు పర్యవేక్షించారు.

సామూహిక కుంకుమ పూజలు



ఉప్పాలమ్మ తల్లి ఆలయంలో చేస్తున్న కుంకుమ పూజలు

కరప: గ్రామ దేవత ఉప్పాలమ్మ తల్లి ఆలయంలో ఆదివారం సామూహిక కుంకుమ పూజలు జరిగాయి. ముందుగా పౌర్ణమిని పురస్కరించుకుని అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. కరప, పరిసర గ్రామాల నుంచి 60 మంది మహిళలు కుంకుమ పూజలకు రాగా, వేద పండితులు మాచరి పురుషోత్తమశర్మ పూజాదికాలు చేయించారు. ప్రతి నెలా పౌర్ణమి రోజున ఈ పూజలు చేయిస్తున్నట్టు ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ చిన్నారి మురళీకృష్ణ తెలిపారు. భక్తులకు రెడ్డి వెంకటరమణ, సూర్యావతి దంపతులు అన్న ప్రసాదాన్ని ఏర్పాటు చేశారు.

కరప మండల అధికారులు	
ఎంపీడీఓ	9346790319
తహసీల్దార్	9849903908
ఈఓ పీఆర్ ఆర్డీ	9849352293
మండల ఇంజనీరింగ్ అధికారి	8886865417
మండల వ్యవసాయాధికారి	8331056589
ఎంఈఓ-1	8008293994
ఎంఈఓ-2	8919940656
హౌసింగ్ ఏఈఈ	7093930450
ఉపాధిపథకం ఏపీఓ	7093998259
వెలుగు ఏపీఎం	9959989273
ఎలక్ట్రికల్ ఏఈ	9440812638
ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ	9603007219
ఇరిగేషన్ ఏఈఈ	9704651826
డ్రెయినేజీశాఖ ఏఈఈ	9963744219
ఆర్అండ్‌బి ఏఈఈ	9440818530
కరప పీహెచ్‌సీ డాక్టర్	8096940176
వేళంగి పీహెచ్‌సీ డాక్టర్	9962553545
పశుసంవర్ధకశాఖ ఏడీఏ	9490047668



కరప విష్ణ్వాలయంలోని వేణుగోపాలస్వామి



కరపలో డూడూ బసవన్నల సందడి(ఫైల్)

మోగిన నెల గంట

- నేటి నుంచి ధనుర్మాసం ప్రారంభం
- గ్రామాల్లో మొదలైన సంక్రాంతి సందడి

కరప: నెలగంట మోగింది. గ్రామాల్లో సంక్రాంతి సందడి మొదలైంది. ధనుర్మాసం రాకను స్వాగతిస్తూ ప్రతి ఇంటా నేటి నుంచి ముత్యాల ముగ్గులు కొలువుదీరనున్నాయి. తెలుగునాట సంప్రదాయాలను శోభాయమానంగా చూపించే సంక్రాంతి సంబరాలకు పల్లెలు ముస్తాబు కానున్నాయి. తెల్లవారుతూనే హరిదాసుల మేలుకొలుపు, హరివిల్లులు, డూడూ బసవన్నల విన్యాసాలు, పిడకల వేటలో చిన్నారులు, కోడి పందేల జోరులో పెద్దలు ఇక సందడి చేయనున్నారు. సోమవారం నుంచి గ్రామాల్లో ధనుర్మాసం ప్రారంభమవుతోంది. ధనుస్సు రాశిలో సూర్యుడు ప్రవేశించడంతో ధనుర్మాసం మొదలవుతుంది. దీనినే ధనుస్సంక్రమణమని, నెల పట్టుట అని అంటారు. మకర సంక్రమణం వరకు కూడా ఈ ధనుర్మాసం కొనసాగుతుంది. విష్ణువుకు అత్యంత ప్రీతిపాత్రమైన ఈ మాసంలో పండగలు వైష్ణవ సంప్రదాయంలో జరుగుతాయి.

కల్యాణంతో ముగింపు

భక్తితో దైవాన్నే పతిగా పొందిన గోదాదేవి తన కోరిక నెరవేర్చుకున్న పుణ్యమాసం ధనుర్మాసమని కరప విష్ణ్వాలయం ప్రధానార్చకుడు పెద్దింటి అనంతాచార్యులు తెలిపారు. జనవరి 13వ తేదీన భోగి రోజున గోదాదేవి కల్యాణంతో ధనుర్మాసం ముగుస్తుందన్నారు. అలాగే జనవరి పదో తేదీన వైకుంఠ ఏకాదశని, దీనినే ముక్కోటి ఏకాదశి అని కూడా వ్యవహరిస్తారని చెప్పారు. అదే రోజున ఆలయంలో భక్తులకు ఉత్తర ద్వారం ద్వారా స్వామివారిని దర్శించుకునేందుకు వీలుగా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్టు ఈఓ కె.తిరుమల రవితేజ తెలిపారు.

విష్ణాలయంలో ..

పెనుగుదురు విష్ణాలయంలో ధనుర్మాస పూజలకు ఏర్పాట్లు చేసినట్టు ఈఓ తెలిపారు. ప్రతిరోజు సుప్రభాత సేవ, తీర్థపుబిందె, తిరుప్పావై ప్రవచనాలు వంటి పూజాదికాలను ఆయా ఆలయాల అర్చకులు నిర్వహిస్తారు. మండలంలోని కరప, జెడ్.భావారం, కూరాడ, పెనుగుదురు, చిన మామిడాడ, గ్రామాల్లో విష్ణ్వాలయాలు, యండమూరు, కరప, పెనుగుదురు, కొంగోడు, కూరాడ గ్రామాల్లో వేంకటేశ్వర స్వామి ఆలయాలు ఉన్నాయి. సోమవారం ఉదయం నుంచి ధనుర్మాసం కలవనుందని అర్చకుడు అనంతాచార్యులు తెలిపారు. ధనుర్మాసం నెల రోజులు వేణుగోపాలస్వామికి తెల్లవారుజామునే పూజా కార్యక్రమాలు నిర్వహించి, నైవేద్యం సమర్పిస్తామన్నారు. ఆయా ఆలయాల్లో ధనుర్మాస పూజలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్టు నిర్వాహకులు, దేవదాయ శాఖాధికారులు తెలిపారు.

ధనుర్మాసంలో ప్రత్యేక పూజలు



విష్ణ్వాలయంలో ధనుర్మాసం నెల రోజులూ స్వామి, అమ్మవార్లకు బాలభోగం, రాజభోగం నైవేద్యం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తాం. తిరుమలలో నిర్వహించేలా సుప్రభాత సేవ, తిరుప్పావై ప్రవచనాలు వంటి పూజాదికాలు నిర్వహిస్తాం. అవివాహితులు ధనుర్మాసంలో గోత్ర నామాలతో పూజలు చేయించుకుంటే వివాహం జరుగుతుంది. 10న ముక్కోటి ఏకాదశి రోజున స్వామివారిని ఉత్తర ద్వారం ద్వారా ప్రవేశించి దర్శనానికి, భోగి రోజున గోదాదేవి కల్యాణం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశాం.

– పెద్దింటి అనంతాచార్యులు, అర్చకులు, కరప విష్ణ్వాలయం



యండమూరులోని మీసాల వేంకటేశ్వరస్వామి

మీసాలతో ఆకర్షణీయంగా..

యండమూరులో సామ్రాజ్యలక్ష్మి, గోదాదేవి సమేత వేంకటేశ్వర స్వామి మీసాలతో ఆకర్షణీయంగా ఉంటారు. ఈ స్వామికి మీసాల వెంకన్న అని కూడా పిలుస్తారు, ఇక్కడి స్వామివారిని దర్శించుకుని, మొక్కుకుని వారానికి ఏడు ప్రదక్షణల వంతున ఏడు శనివారాలు ఆలయానికి వచ్చి, స్వామివారిని దర్శించుకుంటే.. కోరిన కోర్కెలు నెరవేరతాయని, వివాహం కానివారికి పెళ్లి జరుగుతుందని భక్తుల విశ్వాసం. ఈ ఆలయంలో ధనుర్మాస పూజలకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు అర్చకులు పెద్దింటి సీతారామం తెలిపారు. తిరుమల వేంకటేశ్వర స్వామి తర్వాత అంతప్రాశస్త్యం, స్థల చరిత్ర కలిగిన ఆలయమని, ఇక్కడ స్వయంభూగా వెలసిన యండమూరు వేంకటేశ్వరస్వామి అని అర్చకులు తెలిపారు. ప్రతిరోజు స్వామివారికి విశేష పూజలు, అమ్మవార్లకు కుంకుమార్చన చేస్తామని సీతారామం వివరించారు.

చాగంటికి అభినందనలు



చాగంటిని సత్కరిస్తున్న సురభి శారద

బాలాజీచెరువు: నైతిక విలువల సలహాదారుడిగా క్యాబినెట్ హోదాలో నియమితులైన ప్రముఖ ప్రవచన కర్త చాగంటి కోటేశ్వరరావుకు రోటరీ క్లబ్ నగర అధ్యక్షురాలు సురభి శారద అభినందనలు తెలిపారు. నగరంలోని రాయుడుపాలెంలో ఉన్న ఆయన స్వగృహంలో ఆదివారం చాగంటిని శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేశారు. ప్రస్తుత కాలంలో విద్యార్థులకు ఆధ్యాత్మిక విషయాలు తెలియజేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. విద్యార్థుల్లో ఆధ్యాత్మికతతో పాటు, భక్తి, నైతిక విలువలు పెంపొందించాలని ఆమె కోరారు.

ఫిబ్రవరి 9న లయన్స్ ప్రాంతీయ సమావేశం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బాలకృష్ణ, సభ్యులు

బాలాజీచెరువు: లయన్స్ క్లబ్ ప్రాంతీయ సమావేశం వచ్చే ఏడాది ఫిబ్రవరి 9వ తేదీన స్థానిక సూర్యకళా మందిరంలో స్నేహపద్మం పేరుతో నిర్వహిస్తున్నట్లు క్లబ్ జిల్లా పూర్వ గవర్నర్ డాక్టర్ బాదం బాలకృష్ణ తెలిపారు. స్థానిక రామారావుపేట లయన్స్ హాల్లో ఆదివారం సాయంత్రం ప్రాంతీయ సమావేశం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్లబ్ ద్వారా సమాజానికి సేవ చేయడానికి మంచి అవకాశం ఉంటుందని చెప్పారు. మరిన్ని కొత్త క్లబ్‌లను ఏర్పాటు చేసి, సభ్యత్వాల సంఖ్యను పెంచాలన్నారు. క్లబ్‌కు దేశవ్యాప్తంగా మంచి గుర్తింపు ఉందన్నారు. ఇందులో సభ్యుడు కావడం అదృష్టంగా భావించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ పూర్వ గవర్నర్ మంజులూరి విశ్వేశ్వరరావు, జోన్ చైర్మన్ గరికిపర్తి నమశ్శివాయ, రామసుబ్రహ్మణ్యం, ఎంవీజే మోహన్‌కుమార్ పాల్గొన్నారు.

ఐక్యతగా హక్కులు సాధించుకోవాలి



సమావేశానికి హాజరైన నాయకులు, ప్రతినిధులు

కాకినాడ సిటీ: పద్మశాలి సామాజిక వర్గీయులు హక్కుల సాధనకు ఐక్యంగా ముందుకు సాగాలని ఆమంచి ఆంజనేయ గురుస్వామి, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పద్మశాలి సంక్షేమ సంఘం అధ్యక్షుడు పంపన రామకృష్ణ పిలుపునిచ్చారు. స్థానిక రాజాట్యాంక్ వద్ద ఉన్న ఫ్యాబిన్ కన్వెన్షన్ హాల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పద్మశాలి సంక్షేమ సంఘం సమావేశం పంపన రామకృష్ణ అధ్యక్షతన జరిగింది. పద్మశాలి సంఘాలన్నింటినీ ఐక్యపరిచి త్వరలోనే జేఏసీని ఏర్పాటు చేస్తామన్నారు. రాజకీయంగా, సామాజికంగా అన్ని రంగాల్లో తమకు న్యాయంగా రావాల్సిన హక్కుల సాధనకు పోరాడతామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు పసగడుగుల సత్యనారాయణ, కొండేటి వీరవెంకట సత్యనారాయణ, కొప్పుల శ్రీనివాస్, బొజ్జ శ్రీశైలం, పంపన సూర్యచంద్రరావు, పద్మశాలి సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా జిల్లా అభివృద్ధి

కౌడా చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన తుమ్మల బాబు



కౌడా చైర్మన్‌గా తుమ్మల బాబుతో ప్రమాణం చేయిస్తున్న వైస్ చైర్‌పర్సన్ భావన

కాకినాడ రూరల్: కాకినాడ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ద్వారా జిల్లాను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేసేందుకు కృషిచేస్తానని కౌడా చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన తుమ్మల రామస్వామి(బాబు) అన్నారు. కౌడా కార్యాలయం వద్ద ఆదివారం ఆయన పదవీ బాధ్యతల స్వీకరణ సందర్భంగా వైస్ చైర్‌పర్సన్ భావన ప్రమాణం చేయించారు. ముఖ్యఅతిథులుగా రాష్ట్ర పర్యాటక మంత్రి కందుల దుర్గేష్, ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, ఎమ్మెల్సీలు యనమల రామకృష్ణుడు, హరి ప్రసాద్, ఎమ్మెల్యేలు పంతం నానాజీ, వనమాడి కొండబాబు, జ్యోతుల నెహ్రూ, వరుపుల సత్యప్రభ, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, టిడ్కో రాష్ట్ర చైర్మన్ వేములపల్లి అజయ్, రాష్ట్ర పౌర సరఫరాల చైర్మన్ తోట సుధీర్, మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ వర్మ, టీడీపీ, బీజేపీ జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్, రాంకుమార్, పలువురు నాయకులు హాజరయ్యారు. అనంతరం తుమ్మల బాబు మీడియాతో మాట్లాడుతూ, తనకు అప్పగించిన పదవిలో బాధ్యతగా పనిచేస్తాన్నారు. స్మార్ట్ సిటీతో పాటు, కౌడా పరిధిలో 21 మండలాలు, 350 గ్రామాల అభివృద్ధికి కౌడా నిధులతో సహకరిస్తానన్నారు. కాకినాడ బీచ్‌లో యుద్ధ విమానం మ్యూజియాన్ని త్వరలో ప్రారంభిస్తామన్నారు.

చిన్నారుల భద్రతతో ఆటలా..!?



దీనిపై జారితే.. చెడ్డీ చిరుగుడ్డి..



బాతు ఎక్కితే.. బోల్తా పడడం ఖాయం



కూర్చుని.. ఊగేదెలా..!

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ): నగరంలోని గాంధీనగర్ పార్కు ఆవరణలో ఉన్న చిన్నపిల్లల క్రీడా మైదానంలో పలు ఆట వస్తువులు ధ్వంసమయ్యాయి. ఆడేందుకు వీలుగా లేకపోవడంతో చిన్నారులు నిరుత్సాహపడుతున్నారు. ఈ మైదానంలోని అప్ అండ్ డౌన్, డక్స్, ఉయ్యాల, జారుడు బల్ల పాడైపోయాయి. ఈ పార్కుకు శని, ఆదివారాల్లో సాయంత్రం నాలుగు నుంచి ఏడు గంటల వరకు వందల సంఖ్యలో చిన్నారులు సందడి చేస్తారు. చిన్న పిల్లలను ఆడించేందుకు తల్లిదండ్రులు, తాతయ్య, అమ్మమ్మ, నానామ్మలు పార్కుకు తీసుకువస్తారు. ఆడేందుకు క్రీడా వస్తువులు సక్రమంగా లేకపోవడంతో అధికారులు స్పందించి, వీటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

కాకినాడ సిటీ: నగరంలోని శ్రీగ్యాస్ ఏజెన్సీ యాజమాన్యం తొలగించిన కార్మికులను పనిలోకి తీసుకోవాలని లేబర్ కోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాలని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గ్యాస్ డెలివరీ వర్కర్స్ యూనియన్ సర్వసభ్య సమావేశం డిమాండ్ చేసింది. ఆదివారం సాయంత్రం స్థానిక పాత బస్టాండ్ వద్ద ఉన్న ఇఫ్టూ జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఇఫ్టూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జె.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, కొన్ని ఎల్‌పీజీ కంపెనీల్లో యాజమాన్యాలు కార్మికులకు అపాయింట్‌మెంట్ ఆర్డర్లు, కనీసం ఐడెంటిటీ కార్డులు కూడా ఇవ్వడం లేదన్నారు. కార్మికులతో వెట్టిచాకిరీ చేయించుకుంటున్నారని, కస్టమర్లు ఇచ్చే టిప్పులపై ఆధారపడి పని చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు చట్టబద్ధ హక్కులు, సౌకర్యాలను అమలు చేయడం లేదని విమర్శించారు. కార్మిక చట్టాలు అమలు చేయని యాజమాన్యాలపై కలెక్టర్, లేబర్ అధికారులు చర్యలు తీసుకోవాలని సమావేశం డిమాండ్ చేసింది. కార్మికులకు కనీస వేతనాలు, పీఎఫ్, ఇఎస్ఐ, బోనస్, గ్రాట్యుటీ వంటి సౌకర్యాలు అమలు చేయాలని కోరింది. సంఘ నాయకులు రాజేష్, బాబి, వీరబాబు, లోవరాజు, బి.కృష్ణ, రాంబాబు, కె.సత్యనారాయణ, చిన్న తదితరులు పాల్గొన్నారు.

నిస్వార్థ త్యాగశీలి పొట్టి శ్రీరాములు

- కలెక్టర్ షణ్మోహన్‌తో పాటు, పలువురు ప్రముఖుల నివాళులు



పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ షణ్మోహన్

కాకినాడ సిటీ: అమరజీవి పొట్టి శ్రీరాములు నిరుపమాన త్యాగఫలమే ఆంధ్రులకు ప్రత్యేక రాష్ట్రంగా సిద్ధించిందని, ఆయన నిస్వార్థ ఆత్మార్పణకు తెలుగు ప్రజలందరూ సదా కృతజ్ఞతాబద్ధులై ఉండాలని కలెక్టర్ షణ్మోహన్ సగిలి అన్నారు. అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకుని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక సీబీఎం స్కూల్ రోడ్డు, ఫెలోషిప్ చర్చి సెంటర్‌లోని ఆయన విగ్రహం వద్ద ఆత్మార్పణ దినం పాటించారు. కలెక్టర్ షణ్మోహన్, సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు, కార్పొరేషన్ కమిషనర్ భావన, పలువురు జిల్లా అధికారులు, పుర ప్రముఖులు.. పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసిచ ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, స్వాతంత్ర్య సమరయోధుడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ మూల పురుషుడు పొట్టి శ్రీరాములు తెలుగువారందరికీ చిరస్మరణీయుడని కొనియాడారు. ఆయన పట్టుదల, కృషి, త్యాగాల ఫలితంగానే తెలుగు భాష మాట్లాడే ప్రజలు ఆత్మ గౌరవంతో పురోగమించేందుకు ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైందని తెలిపారు. తెలుగు జాతి కోసం చేసిన నిరుపమాన, నిస్వార్థ త్యాగానికి కృతజ్ఞతగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఆయన వర్ధంతిని ఆత్మార్పణ దినంగా ప్రకటించి, ఏటా రాష్ట్రవ్యాప్తంగా శ్రద్ధాభక్తులతో పాటిస్తున్నట్టు చెప్పారు. ఆయన ఆదర్శాలను యువత స్ఫూర్తిగా తీసుకుని, రాష్ట్రాభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమాధికారి ఎం లల్లి, బీసీ కార్పొరేషన్ ఈడీ ఎ.శ్రీనివాసరావు, యువజన సర్వీసుల శాఖ సీఈవో కాశీవిశ్వేశ్వరరావు, తహసీల్దార్ జితేంద్ర, ఎంహెచ్‌వో డాక్టర్ డి.పృథ్వీచరణ్ తదితరులు పాల్గొన్నారు.



పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జేసీ రాహుల్ మీనా



పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేస్తున్న డీఎస్‌డీఓ



పీఆర్ కళాశాలలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు



కరపలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీడీఓ, ఈఓపీఆర్డీ

ఆయన కృషి మరువలేనిది

బాలాజీచెరువు: ఆంధ్ర రాష్ట్ర అవతరణకు అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన ప్రాణత్యాగం మరువలేనిదని పీఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ తిరుపాణ్యం అన్నారు. అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా కళాశాల ఆవరణలో ఆత్మార్పణ దినం నిర్వహించి, ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తిరుపాణ్యం మాట్లాడుతూ, తెలుగు జాతి ఉన్నంత కాలం ఆయనను స్మరించుకోవాలన్నారు. హిందీ విభాగాధిపతి పి.హరిరామప్రసాద్ మాట్లాడుతూ, కులమతాలకు అతీతంగా ప్రజల కోసం ఆయన ప్రాణత్యాగం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆత్మత్యాగం చేసిన మహనీయుడు

కరప: ఆంధ్రరాష్ట్ర అవతరణకు ప్రాణత్యాగం చేసిన మహనీయుడు పొట్టి శ్రీరాములు అని ఎంపీడీఓ ఎం.అనుపమ అన్నారు. పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పించారు. భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు ఆద్యుడని ఆమె శ్లాఘించారు. ఏఓ జీఎల్ నరసింహ, ఈఓపీఆర్డీ ఎస్వీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. కరప పంచాయతీ కార్యాలయంలో కార్యదర్శి నిర్మలాదేవి, ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు సిబ్బందితో కలిసి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పించారు.

జేసీ రాహుల్ మీనా నివాళి

కాకినాడ సిటీ: అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా.. ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. తెలుగు మాట్లాడే వారి కోసం ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటుకు ఆయన చేసిన కృషిని ప్రస్తుతించారు. కలెక్టరేట్ పరిపాలనాధికారి రామమోహన్‌రావు, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ): అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా స్థానిక గుడారిగుంటలోని మూడుగుళ్ల సమీపంలో ఉన్న ఆయన విగ్రహానికి డీఎస్‌డీఓ శ్రీనివాస్‌కుమార్ నివాళులర్పించారు. రాష్ట్ర అవతరణ కోసం పొట్టి శ్రీరాములు చేసిన త్యాగాన్ని ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలన్నారు. సోషల్ వెల్ఫేర్ సూపరింటెండెంట్ పీటీ దొర, మూడు గుళ్ల కమిటీ అధ్యక్షుడు వై.గోవిందరావు, సభ్యులు బాబ్జి, లోవరాజు, జిమ్నాస్టిక్స్ కోచ్ సురేష్ పాల్గొన్నారు.